## క్లుప్తంగా

### భక్తి శ్రద్ధలతో బల్లల పండగ



నక్కపల్లిలో బల్లల పండగ సందర్భంగా నేలవేషాలతో ఊరేగింపు

నక్కపల్లి : మండల కేంద్రంలో రజకులు బల్లల పండగను ఆదివారం అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ప్రతి ఏటా సంక్రాంతి అనంతరం ఈ పండగను రజకులు ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. నక్కపల్లిలో బళ్లవేషాలు, నేలవేషాలతో ఊరేగింపు నిర్వహించారు. తమ కులదైవానికి పూజలు నిర్వహించారు. రజకులు చేస్తున్న బల్లల పండగకు పలువురు తమకు తోచిన రీతిలో కానుకలు అందజేశారు.

### నాగవరంలో రహదారి సదుపాయం పట్ల హర్షం



నాగవరం పంచాయతీలో నూతనంగా నిర్మించిన రోడ్డు

మునగపాక : మండలంలోని నాగవరం పంచాయతీ వెంకన్నపాలెం నుంచి నందిగోళ్ల ఇళ్ల వరకు సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయింది. సీఎఫ్ఎంఎస్ ద్వారా రూ.6 లక్షల వ్యయంతో రహదారి నిర్మించారు. గతంలో ఈ ప్రాంతానికి వెళ్లేందుకు అనువుగా రహదారి సదుపాయం లేకపోవడంతో ఇబ్బందులు పడేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తమ ప్రాంతానికి రహదారి సదుపాయం కల్పించడంతో సర్పంచ్ రమణమ్మకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

### తాగునీటి సమస్య రాకుండా చర్యలు



గేటువాల్వ్ పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ అప్పారావు

మునగపాక: ప్రజల తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకుంటున్నామని మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు అన్నారు. మునగపాక దళితవాడలో మరమ్మతుకు గురైన రక్షిత మంచినీటి పథకం గేట్‌వాల్వ్ స్థానంలో కొత్తవి ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వేసవిలో ఎక్కడైనా తాగునీటి సమస్య తలెత్తితే తన దృష్టికి తీసుకురావాలన్నారు.

### తడి, పొడి చెత్తను వేరు చేయండి



బీసీ కాలనీలో బుట్టలు అందజేస్తున్న ఉప సర్పంచ్ అప్పలనాయుడు

మునగపాక: ప్రతి ఒక్కరూ తడి,పొడి చెత్తను వేర్వేరుగా పంచాయతీ సిబ్బందికి అందజేయాలని మునగపాక ఉప సర్పంచ్ బొడ్డేడ అప్పలనాయుడు కోరారు. మునగపాక బీసీ కాలనీలో ఆయన ఆదివారం తడి,పొడి చెత్తకు సంబంధించి బుట్టలు పంపిణీ చేశారు. తడి, పొడి చెత్త సేకరణ ద్వారా సంపదతయారీ కేంద్రానికి ఆదాయం సమకూరుతుందన్నారు.

### 20న వక్తృత్వ పోటీలు

అనకాపల్లి : తెలుగు భాష పరిరక్షణ సమితి, రామ్‌కీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 20న విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నారు. రింగ్‌రోడ్డు హిమశేఖర్ డిగ్రీ కళాశాల ఆవరణలో మాతృభాష దినోత్సవం సందర్భంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలుగు భాష పరిరక్షణ సమితి ప్రతినిధి రామ్‌మోహన్‌రావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సీనియర్ విభాగం (ఇంటర్ ఆపైన) తెలు గు భాష గొప్పదనం పరిరక్షణ, జూనియర్ విభాగం(8,9,10 తరగతులు) వేమన చరిత్ర, సబ్ జూనియర్ విభాగంలో (6, 7 తరగతులు) సుమ తీ శతకంలోని పద్యాలు, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తామన్నారు.



# బండరాళ్ల తరలింపుతో పొంచి ఉన్న ముప్పు



బండరాళ్లు తరలిస్తున్న వాహనాలు



ఆర్.నర్సాపురంలో సమీపంలో రోడ్డు అంచున పడివున్న బండరాళ్లు

- నేవల్‌బేస్‌కు వందలాది భారీ వాహనాల్లో తరలింపు
- దెబ్బతింటున్న రోడ్లు
- దుమ్ము ధూళితో ప్రజలు అవస్థలు

రాంబిల్లి: నేవల్‌బేస్‌కు తరలిస్తున్న భారీ బండరాళ్లతో ప్రమాదం పొంచి ఉంది. ఈ బండరాళ్లను భారీ లారీలతో పరిమితికి మించి తరలిస్తున్నారు. పైకి కనిపించకుండా పరదాల చాటున మరీ పరిమితికి మించి తరలిస్తున్నారు. రోజూ వందలాది లారీల్లో ఈ తరలింపు జరుగుతోంది. తరలింపు ప్రక్రియలో ఈ బండరాళ్ల అటుగా వెళ్తున్న పాదచారులు, ద్విచక్ర ఇతర వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు. ఇటీవల జరిగిన ఒక ప్రమాదం ఇందుకు అద్దం పడుతుంది. ఆర్. నర్సాపురం సమీపంలో ఇటీవల ఒక లారీ నుంచి బండరాళ్లు రోడ్డుపై పడ్డాయి. రాత్రి వేళ కావడంతో ఆయా సమయంలో వాహనాలు రాకపోకలు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. రోడ్డుపై పడ్డ బండరాళ్లను రోడ్డు అంచుకు సమీపంలో యంత్ర సాయంతో జరిపారు. ఇలాంటి ప్రమాదం మళ్లీ జరిగితే ప్రమాదం తప్పదని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ బండరాళ్ల వాహనాలు వెళ్లినపుడు తమ ఇళ్లు సైతం కంపించినట్లవుందని పలువురు భయపడుతున్నారు. మరోపక్క భారీ లోడ్ వాహనాల రాకపోకలు కారణంగా వెంకటాపురం నుంచి రాంబిల్లి మీదుగా నేవల్‌బేస్ వరకు గల రోడ్డు దెబ్బతింది. ఇప్పటికే గోతులమయంగా మారిన ఈ రోడ్డు మరింత దెబ్బతింటుంది. దీంతో ఈ రోడ్డుపై రాకపోకలు ప్రమాదకరంగా మారాయి. అంతేగాక వందలాది లారీల రాకపోకలు కారణంగా దుమ్ము, ధూళి విపరీతంగా పెరిగిపోతుంది. దీని కారణంగా శ్వాస సంబంధిత సమస్యలు తలెత్తుతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా ఆర్‌టీఏ ఇతర సంబంధిత అధికారులు పట్టించుకోలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు తనిఖీలు నిర్వహించకుండా భారీ వాహనాలను వదిలేయడంతో బండరాళ్ల తరలింపు నిబంధనలు పాటించకుండా దర్జాగా సాగిపోతుంది. ఉన్నతాధికారులు దీనిపై దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## చేపల వేటకు రింగు వలలు వాడొద్దు



అడ్డురోడ్డులో నక్కపల్లి సర్కిల్ కార్యాలయంలో డీఎస్పీతో సమావేశమైన మత్స్యకారులు

ఎస్.రాయవరం : మత్స్యకారులు తీర ప్రాంతంలో రింగు వలలు ఉపయోగించి చేపల వేట చేయరాదని నర్సీపట్నం డీఎస్పీ వెంకట్రామయ్య సూచించారు. అడ్డురోడ్డు నక్కపల్లి సర్కిల్ కార్యాలయంలో నక్కపల్లి, పాయకరావుపేట, ఎస్.రాయవరం మండలాలకు చెందిన మత్స్యకార గ్రామ పెద్దలతో ఆదివారం సమావేశం ఏర్పాటు చేశారు. పాయకరావుపేట, నక్కపల్లి ప్రాంతానికి చెందిన మత్స్యకారులు ఇటీవల రింగ్ వలలు ఉపయోగించి వేట చేస్తున్నారని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు హెచ్చరికలు చేశారు. ఇకపై రింగు వలలు ఉపయోగించి వేట చేయబోమని తీర్మాణం చేసి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నక్కపల్లి సీఐ అప్పన్న, ఎస్.రాయవరం ఎస్ఐ విభీషణరావు బంగారమ్మపాలెం సర్పంచ్ మైలపల్లి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

## భక్తిశ్రద్ధలతో సూర్యదేవుని నోములు



నోముల్లో భాగంగా సిద్ధం చేసిన రోలు



సూర్యనారాయణమూర్తికి పూజలు చేస్తున్న దృశ్యం

మునగపాక : మండలంలో పలు గ్రామాల్లో ఆదివారం సూర్యనారాయణమూర్తి నోములు భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు.
నోములు నోచుకునే కుటుంబాలు ప్రత్యేక పూజలు చేశారు. నోములున్న కుటుంబాలు జారు విరిచే పలు రకాల వస్తువులను పట్టుకునేందుకు భక్తులు పోటీపడ్డారు. ఇలా జార విడిచే వస్తువులు దొరికితే దేవుని అనుగ్రహం ఉంటుందని నమ్మకం ఉండడంతో వస్తువులను పట్టుకునేందుకు ఆసక్తి చూపారు.

## టిడ్కో ఇళ్ల వద్ద ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట



కార్యక్రమంలో ఎంపీపీ గోవింద్, యలమంచిలి మార్కెట్ కమిటీ చైర్మన్ బొద్దపు యర్రయ్యదొర

యలమంచిలి : యలమంచిలి మున్సిపాలిటీ రామ్‌నగర్ వద్ద గల టిడ్కో గృహాల వద్ద ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఇక్కడ 11 అడుగుల భక్తంజనేయ విగ్రహాన్ని స్థానికులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యలమంచిలి మండలం ఎంపీపీ బోదెపు గోవింద్, యలమంచిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొద్దపు యర్రయ్యదొర హాజరై ఆంజనేయస్వామి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం టిడ్కో గృహ సముదాయం వద్ద భారీ అన్నసమారాధన జరిపారు. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి ఆంజనేయ స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మున్సిపల్ వైస్ చైర్మన్‌లు బెజవాడ నాగేశ్వరరావు, కౌన్సిలర్ పడాల కావ్య , వైఎస్సార్‌సీపీ నాయకులు పడాల శ్రీనివాస్, పిళ్లా త్రినాథ్, మరిణేశ్వరరావు, టిడ్కో గృహ సముదాయ సభ్యులు పాల్గొన్నారు.

## వెంకన్న ఆలయ శంకుస్థాపనకు ఏర్పాట్లు పూర్తి



మునగపాకలో వేంకటేశ్వర స్వామి ఆలయ శంకుస్థాపన ఏర్పాట్లు పరిశీలిస్తున్న దృశ్యం

మునగపాక: మునగపాక బైపాస్ రోడ్డును ఆనుకొని నూతనంగా నిర్మించనున్న వేంకటేశ్వరస్వామి ఆలయ శంకుస్థాపన కార్యక్రమానికి నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సుమారు రూ.4 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఆలయ శంకుస్థాపనను ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. సోమవారం ఉదయం 10.34 గంటలకు వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య కార్యక్రమం నిర్వహించేలా చర్యలు చేపట్టారు. అదే రోజు మధ్యాహ్నం 6వేల మందికి భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. పలు రాజకీయ పార్టీలకు చెందిన నేతలు కార్యక్రమంలో భాగస్వామ్యం కానున్నారు. శంకుస్థాపన సందర్భంగా ప్రాంగణంలో సేవగరిడీలు, అలాగే పలు ప్రాంతాలకు చెందిన కోలాటం ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావాలని నిర్వాహకులు కోరుతున్నారు.

## పార్టీ పదవులు పొందిన వారికి అభినందనలు



జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం



పార్టీ పదవులు పొందిన వారిని అభినందిస్తున్న వీసం తదితరులు

నక్కపల్లి: ఇటీవల వైఎస్సార్‌సీపీ ప్రకటించిన జిల్లా అనుబంధ విభాగాల్లో పలు కీలక పదవులు పొందిన వారికి అభినందనలు తెలిపే కార్యక్రమం ఆదివారం నక్కపల్లిలో నిర్వహించారు. ముందుగా మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీఎం జగన్ మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. జిల్లా స్టూడెంట్ విభాగం అధ్యక్షుడిగా నియమితులైన కొప్పిశెట్టి హరిబాబు, మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన తాజుద్దీన్, యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శులుగా నియమితులైన తళ్ల బార్గవ్, సాదిరెడ్డి శ్రీను, బీసీ విభాగం ఉపాధ్యక్షుడిగా నియమితులైన గొర్ల గోవిందు, అలాగే పలు జిల్లా పదవులు పొందిన దమ్ము వెంకటరమణ తదితరులను కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, జడ్పీటీసీ కాసులమ్మ అభినందించారు. పార్టీ అధినేత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అప్పగించిన ఈ బాధ్యతలు తప్పకుండా న్యాయం చేస్తామని వచ్చే ఎన్నికల్లో జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకునేందుకు అయన ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని చెప్పారు. బూత్ స్థాయి నుంచి పార్టీ పటిష్టానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ నిట్ల గోవిందు, పార్టీ నాయకుడు అల్లాడ కొండ పాల్గొన్నారు.

## ఫ్యాషన్ గార్మెంట్స్ మేకింగ్ కోర్సులో ప్రవేశానికి ఎంట్రన్స్ టెస్టు



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

అచ్యుతాపురం: మండలంలోని ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలలో ఫ్యాషన్ గార్మెంట్స్, మేకింగ్ కోర్సులో ప్రవేశానికి నిర్వహించిన ఎంట్రన్స్ టెస్టుకు 200 మందికి పైగా హాజరయ్యారు. బ్రాండిక్స్ సహకారంతో నిర్వహిస్తున్న ఈ కోర్సులో ప్రవేశానికి ఎంట్రన్స్ టెస్టు ఆదివారం నిర్వహించారు. రెండేళ్ల కాల పరిమితి ఉన్న ఈ కోర్సులో 30 సీట్లు ఉన్నాయని, సీట్లు లభించిన వారికి నెలవారీ స్టైఫండ్ ఇస్తామని కళాశాల ప్రిన్సిపాల్ నాయుడు తెలిపారు.

### ధర్నా శిబిరానికి అనుమతి లేదు

రాంబిల్లి: పెదకలవలాపల్లి వద్ద నిర్వహిస్తున్న ధర్నా శిబిరానికి అనుమతులు లేకపోవడంతో ఆదివారం తొలగించినట్లు సీఐ ఎస్.లక్ష్మణరావు తెలిపారు. కొన్ని రోజులుగా ఈ గ్రామంలో నేవీ ప్రహరీతో తమకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని , ప్రభుత్వం ఆదుకొని తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ కొందరు ధర్నా చేస్తున్నారు. ఆదివారం సీఐ లక్ష్మణరావు ఆధ్వర్యంలో పోలీసులు ఈ శిబిరం వద్దకు వెళ్లి అనుమతులు లేకుండా ధర్నాలు చేయడం సరికాదని పేర్కొన్నారు. రావి దేముళ్ల మరికొంత మందిపై కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

## సెజ్ నిర్వాసితుల కోసం పార్టీలకతీతంగా పోరాడతాం

జిల్లా వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు కొరుప్రోలు చిన్నారావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

అచ్యుతాపురం : అచ్యుతాపురం సెజ్ పరిధిలోని నిర్వాసితులకు కాంట్రాక్టు పనులు అప్పగించాలని వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు కొరుప్రోలు చిన్నారావు డిమాండ్ చేశారు. అచ్యుతాపురంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిర్వాసితులకు నష్టపరిహారం ఇచ్చారే తప్ప ఉపాధి అవకాశాలు కల్పించలేదన్నారు. నిర్వాసితులకు న్యాయం చేస్తే తాము సంతోషిస్తామని తెలిపారు. పార్టీలకతీతంగా అఖిలపక్షంతో కలిసి ఎస్ఈజెడ్‌లో జరిగే అవకతవకలపై పోరాడుతామని తెలిపారు. సమావేశంలో జిల్లా వైఎస్సార్‌సీపీ నాయకులు బాబ్జి, ఈత బాబూరావు, కిరణ్ పాల్గొన్నారు.

## లక్ష్య సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



ఉపకార వేతనాలకు ఎంపికైన విద్యార్థులతో జబర్దస్త్ కళాకారుడు సత్తిపండు

జబర్దస్త్ కళాకారుడు సత్తిపండు

మునగపాక: విద్యార్థులు లక్ష్యం సాధించేందుకు కష్టపడి చదువుకోవాలని జబర్దస్త్ కళాకారుడు సత్తిపండు కోరారు. మునగపాక హైస్కూల్లో ఆదివారం సాయంత్రం స్పందించే హృదయం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రవాస భారతీయురాలు ఆడారి పావని సమకూర్చిన ఉపకార వేతనాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమ భవిష్యత్‌ను తీర్చిదిద్దేందుకు సరైన ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. మాజీ ఎంపీపీ కొయిలాడ వెంకట్ మాట్లాడుతూ బాలికలు చదువులో రాణించాలన్నారు. సంస్థ ప్రతినిధి శిష్టా తమ్మిరాజు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో కె.వి.రమణ,ప్రసాద్, నూకేష్, ఎం.సత్యనారాయణ,దుర్గా ప్రసాద్, ఎ.వి.ఎస్ మూర్తి,, మాడెం జోగారావు, పిల్లా జగదీష్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## అలరించిన త్యాగ రాజస్వామి కీర్తనలు



త్యాగరాజ స్వామి కీర్తనలు ఆలపిస్తున్న గాయకులు

యలమంచిలి : సద్గురు శ్రీ త్యాగరాజ స్వామి వారి ఆరాధనోత్సవాలు ఆదివారం యలమంచిలి పట్టణం కొత్తపేట రామాలయంలో ఘనంగా నిర్వహించారు. త్యాగరాజ ఆరాధనోత్సవాలలో భాగంగా యలమంచిలి పట్టణంలో గాత్ర కచేరీ, సంగీత వాగ్గేయ కారులు త్యాగరాజస్వామి కీర్తనలు ఆలపించారు. ఈ సందర్భంగా త్యాగరాజ స్వామి వారి గొప్పతనాన్ని స్మరించుకుని వారి గీతాలు ఆలపించారు. ఈ గాత్ర కచేరీలో ఇవటూరి కృష్ణ శృతి, వయోలిన్ కోట గాయిత్రి వరేణ్య, మృదంగం పి.వి.ఎస్. బాలజీ, యువరాజ్ సంగీతం వినిపించారు.

## ఘనంగా కనకదుర్గమ్మ విగ్రహ ప్రతిష్ట మహోత్సవం



కనకదుర్గమ్మ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి



కనకదుర్గమ్మను దర్శించుకుంటున్న కమిటీ సభ్యులు

యలమంచిలి : యలమంచిలి మున్సిపాలిటీ సైతారుపేట రోడ్డు రెల్లి వీధిలో ఆదివారం శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం ఘనంగా జరిగింది. ఇక్కడ నూతనంగా నిర్మించిన కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవానికి యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి ముఖ్య అతిథిగా విచ్చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు ఆధునిక వాస్తు సిద్ధాంతి శ్రీ రాచకొండ శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి యంత్ర స్థాపన, విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కనకదుర్గమ్మ ఆలయం వద్ద మధ్యాహ్నం భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని ఉత్సవ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. అమ్మవారి దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకుని ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కనకదుర్గమ్మ ఆలయ నిర్మాణ కమిటీ పల్లా శ్రీనివాస రావు పాల్గొన్నారు.

## విశ్వకర్మ పథకాన్ని దర్జీలు సద్వినియోగం చేసుకోవాలి

రాష్ట్ర టైలర్ల సంఘం ప్రధాన కార్యదర్శి అతికిని శెట్టి సత్యనారాయణ



మాట్లాడుతున్న రాష్ట్ర టైలర్ల సంఘం ప్రధాన కార్యదర్శి అతికినిశెట్టి సత్యనారాయణ

యలమంచిలి : విశ్వకర్మ పథకాన్ని రాష్ట్రంలో టైలర్లు అందరూ సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర టైలర్ల సంఘం ప్రధాన కార్యదర్శి అతికి నిశెట్టి సత్యనారాయణ అన్నారు. యలమంచిలి పట్టణంలో ఉన్న టైలర్లతో ఆదివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం టైలర్ల సంక్షేమానికి ఆర్థికంగా చేయూత నందిస్తుందని,అలాగే కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విశ్వకర్మ పథకంలో ప్రతి ఒక్కరూ తమ వివరాలు నమోదు చేయించుకోవాలని, టైలర్లు అందరూ ఐక్యంగా ఉండి ఒకరికి ఒకరు తోడ్పాటు అందించుకోవాలని కోరారు. ఈ నెల 28న టైలర్స్ డే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా సీనియర్ టైలర్ల సేవలను గుర్తించి ఘనంగా సన్మానించారు. రాష్ట్ర టైలర్ల సంఘం ప్రధాన కార్యదర్శిగా నియమితులైన అతికిని శెట్టి సత్యనారాయణను టైలర్లు అందరూ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యలమంచిలి టైలర్ల సంఘం అధ్యక్షుడు వియ్యపు సత్యనారాయణ , పిళ్లా శివ, మళ్ల నాగేశ్వరరావు, డి.శేషుబాబు, వి.రమేష్, ఎస్.భద్రరావు, కారుకొండ భద్రరావు, వెంకటరావు, జి.అప్పారావు, బొడ్డేటి అప్పారావు, కట్టా సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎస్.రాయవరం : రెడీమేడ్ వ్యవస్థతో కనుమరుగు అవుతున్న టైలరింగ్ వృత్తికి తిరిగి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గుర్తింపునిచ్చారని న్యూ నవ్యాంధ్ర టైలర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అతికినశెట్టి సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలో మండల టైలర్ల సంఘ సభ్యులు , టైలర్లు ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ టైలర్లు అందరూ ఐక్యంగా ఉంటూ మనకి గౌరవం, గుర్తింపునిచ్చినవారి ఆశయాలకు అనుగుణంగా పని చేయాలన్నారు. ఈనెల 28 న టైలర్స్ డే నిర్వహణ ఘనంగా చేపట్టాలన్నారు. అదే క్రమంలో పీఎం మోదీ కూడా విశ్వకర్మ పథకంలో టైలర్స్‌కు ప్రాధాన్యం ఇచ్చి ప్రోత్సహిస్తున్నారన్నారు. దీనిని కూడా ప్రతి ఒక్కరూ ఉపయోగించుకుని సద్వినియోగించుకోవాలన్నారు. ఈ సందర్భంగా పి.ధర్మవరం గ్రామానికి చెందిన టైలర్ అద్దేపల్లి సత్యనారాయణ న్యూ నవ్యాంధ్ర రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా నియమితులైనట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల టైలర్ సంఘ అధ్యక్షుడు జి.రాము, సాయిరామ్, మూలాస్వామి, నూకరాజు, నల్లబ్బాయి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

## రేపటి నుంచి కన్యకాపరమేశ్వరి శత జయంతి వేడుకలు

అనకాపల్లి: శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయ ప్రతిష్ఠా శత జయంతి ఉత్సవాలను ఈ నెల 20 నుంచి 23వ తేదీ వరకూ నిర్వహించనున్నట్టు ప్రతిష్ఠా శత జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు తెలిపారు. స్థానిక మెయిన్ రోడ్డులోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆలయాన్ని 1925 ఫిబ్రవరి 4న(భీష్మ ఏకాదశి రోజున) నిర్మించినట్టు చెప్పారు. ఈ మేరకు 100వ శతజయంతిని ఈ ఏడాది 20న భీష్మ ఏకాదశి రోజున నిర్వహించనున్నామన్నారు. ఈ వేడుకలను పురస్కరించుకుని 90 కేజీల వెండితో తయారు చేసిన అమ్మవారి రథాన్ని ఊరేగిస్తామన్నారు. 108 మంది మహిళలు 108 కలశాలతో శోభాయాత్ర చేపడతామన్నారు.